

"ఏమి టాలోచిస్తున్నావు ?"

ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

"ఎంత సేపయింది వచ్చి ?" మొగం దాటు జేసుకోవాలనే ప్రయత్నంలో తడబడ్తూ కుర్చీని జేరింది వసంత. ఆమె చెంపల్ని ఆరిన నీటిచారల్ని వంక విస్తుపోయి చూడసాగాడు రావు.

"ఏం. యివాళ యెక్కడికీ పోవడం లేదా ?...వెధవ వాన ఒకటీ : ఏం చెయ్యానికీ తోచకుండా!...పోనీ, నవ లేసన్నా యిమ్మంటావా ? మొన్నే కొన్నాను. స్టీన్ బెక్ ది, చాలా బాగుంది......రా, చూద్దువుగాని; యింకా చాలా ఉన్నాయి!"

ప్రశ్నలు, సమాధానాలు అన్నీ తనే చెప్పుకుంటూ కుర్చీలోంచి లేచి అలమార దగ్గరకి నడిచింది.

"అలా ఉన్నావేం? ఒంటో బాగో లేదా?"

"బాగోకేం? నిక్షేపంలా ఉంది." అలమారదగ్గరే తల వంచుకు నిలబడి అదోలా కృత్రిమంగా నవ్వింది.

"రా, యిలా వచ్చి కూర్చో."

కొద్దిసేపు ఏదో ఆలోచించి, నెమ్మదిగా యెదురుగ్గా వచ్చి కూర్చొంది వసంత. అతనలా చూస్తుంటే, ఏం చేయాలో తోచని సంభ్రమం, సిగ్గు కలిసిపోయిన అవస్థలో, ఆకాశంమీద కొండ గీసిన గీతవంకా, టీపాయ్‌మీది వేజ్‌లో ప్లాస్టిక్ పూలరేకుల వంకా, గోడమీది అజంతా ఫ్రెస్కో తాలూకు కాలెండరు బొమ్మ వంకా మార్చి చూడసాగింది.

"ఏడుస్తున్నావా?"

"ఎందుకు? ఏడుపెందుకు?"

"అదే, నే నడిగేదీని"

వసంత జవాబివ్వలేదు.

"టియర్స్! ఐడిల్ టియర్స్!— అవునా!"

వసంత నిశ్శబ్దంగా కదిలే చేతి గడియారం ముల్లు వంక అదేపనిగా చూడసాగింది.

"ఈ కారు మబ్బులు కార్చే పేడి కన్నీరు, పచ్చని లేత చిగుళ్ళతో గాలిపిల్లల కేరింతలు, కొండ వదిలే నిట్టూర్పులకి చలించి మనక తెరలుగా చెదిరిపోయిన నీటి తుంపర — ప్రకృతి కాంత నగ్న సౌందర్యం చూస్తుంటే, అమ్మాయి లేత మనసులో రసావేశం కట్టలు తెంచుకుంటోందా?" వసంత ఏడవడానికి అంత కన్నా పెద్ద కారణం కనబడలేదు రావుకి.

వసంత నవ్వుతూ అవునన్నట్టు తలాడించింది.

"ఏడవడం **ఒక** లగ్జరీ; యీ మబ్బులన్నీ నావి కావని యీ మూల కూర్చొని యేడుస్తానంటా డొక మహాకవి!"

"కీట్సు గదూ!"

"కీట్సు ఒక్కడే కాదు. యింకా చాలామంది అన్నారనుకో. యింతకీ వాళ్ళు రాసి ఊరుకున్నది నువ్వు చేసి చూపిస్తున్నావా?"

వసంత కేం చెప్పాలో తోచలేదు.

రావు వచ్చిన పది రోజుల్లో నూ, వాళ్ళిద్దరిమధ్యా మాటలు చాలా అసంబద్ధంగా, కష్టంమీద జరుగుతున్నాయి; రోజూకన్న ఆవేళ మరీని.

"మాట్లాడాలని లేదా?" రావు అన్నాడు చివరికి మెల్లిగా.

ఊరికే మామూలుగా అన్నాడో, లేక మనసులో ఏమున్నా పెట్టుకొని అంటున్నాడో అర్థం కాలేదు వసంతకి. బాధగా అతని వంక ఒకసారి చూసి కళ్ళు దించుకుంది.

"నా కేమిటో మనసులో బాగాలేదు

బావా ! అంతకన్నా యింకేం లేదు."

"సినిమాకి పోదాం రా."

"పోనిద్దూ. అంతకన్నా యింటో కూర్చొని కబుర్లు చెప్పుకుంటూంటే హాయిగా ఉంటుంది."

"యిద్దరం కూర్చొంటే కబుర్లు రావు — ఆలోచనలు తప్పించి. ఆలోచించిన కొద్దీ యింకా యింకా ఊబిలోకి దిగిపోతున్నట్టుంటుంది !"

"ఏం, అలా ఉంటే బాగుండదూ ! ఆ కలతలో ఆ వేదనలో ఎంత మాధుర్యం, ఆనందం !"

రావు నవ్వుతూ లేచాడు.

"నేను వెళ్తాను మరయితే."

"అది కాదు. కూర్చో బావా ? యెక్కడికి పోతావు యీ చినుకూ, గాలిలో ! కాలక్షేపం కావాలంటే, కార్డ్స్ తీసుకొస్తాను. చదరంగం కూడా ఉంది గాని నాకు సరిగా రాదు మరి ! రెండు యెత్తుల్లోనే కట్టేస్తావేమో !...ఎందుకూ, కార్డ్స్ ఆడదాం..." వసంత నిలబడి బతిమాలుతున్నట్టు, మందలిస్తున్నట్టు, దీనంగా, కోపంగా, నవ్వుతూ తొందరగా చెప్పింది.

"ఫర్వాలేదులే, అంత జాలి చూపక్కర్లేదు గాని — నేను వెళ్ళాలి. కోమలి కనిపెట్టుకుంటుంది."

వసంత మాట్లాడకుండా తల దించుకుంది. ఈ అయిదారు రోజుల్లోనూ యించుమించు ప్రతిసారీ, ఎక్కడ మొదలయినా ఆమె ఆలోచనలు సరిగ్గా అక్కడే ఆగిపోతున్నాయి. రావు వెళ్ళిపోయాడు.

తలుపు గడియ వేసి కిటికీ దగ్గర నిలబడింది. రావు గేటు తీసుకొని, బయటికి వెళ్ళడం కనబడింది.

ఆకాశంలో ఒకమేర కొద్దిగా తెలుపయింది. వెనకాల మబ్బు లున్న మేర నల్లగా చీకటి కమ్ముతుంటే, రావు ఎర్రని శరీరం తెల్లటి బట్టలు కాంతి రెట్టింపు చేసుకొని వెలుగుతున్నాయి.

వసంత అతనివంక అలాగే చూసింది.

అతను మలుపు దాటాడు.

ఒక్కసారిగా అంతులేని బాధని గుండెలోకి దిమ్మరించినట్టయింది. నిలబడలేనంత నీరసం కమ్ముకుంటూంటే మంచంమీద వాలిపోయి దిండులో తల దూర్చింది వసంత.

కోమలి ! కోమలి యెవరు ? కోమలి అతని కెలా తెలుసు ? వాళ్ళిద్దరికీ యేమిటి సంబంధం ? ప్రతీ రోజూ, గార్డెన్లో, సినిమా హాల్లో, టాంక్‌బండ్ మీద ఎక్కడో చోట 'రెండవూ' ఏర్పర్చుకొని తప్పనిసరిగా కలుసుకోకపోతే ఉండలేనంతటి ఆత్మీయురాలా ?

ఆ రోజు ఉదయాన్నే ఫోన్ మ్రోగింది. రావు మేడమీద ఉన్నాడు. మూర్తిగారు స్నానానికెళ్ళారు. పార్వతమ్మగారు పూజలో ఉంది. నౌకరెవడూ దగ్గర్లో లేడు. వసంత ఫోన్

యెత్తింది. అవతల యెవరో ఆడగొంతు. అనుమానం నిజమవగానే మెట్లవంక చూస్తూ మాటలు కలిపింది.

''రామారావుగా రున్నారాండీ?''

''ఉన్నారు; మీ రెవరు?''

"కోమలి.''

"ఏం, పని?''

''ఉంటే, ఆయన్ని కొంచెం పిలవండి.''

''ఆయనొచ్చేసరికి పావు గంటయినా కనీసం పడుతుంది. మీరు చెప్పే దేదో రహస్యం కాకపోతే నాతో చెప్పండి. లేకపోతే, ఓ అరగంట ఆగి మళ్ళా రింగ్ చెయ్యండి...నే నాయన కజిన్ – వసంత." కొంచెం విసుగ్గా అంది.

"సారీ, మీ రనుకో లేదు; మోర్నింగ్!...రహస్యం యేం లేదు.." కోమలి చేసిన ఆలస్యానికి కారణం. ఆశ్చర్యం తడబడ్డం లాంటివా లేక మామూలుగా జరిగేదేనా! – ఆలోచిం చింది వసంత.

ఏమిటో! మెద డంతా పెద్ద ఫాక్టరీలా గయి, డిటెక్టివ్‌ల మల్లే ప్రతీ చిన్న విష యంపైనా అదేపనిగా ఆలోచిస్తోంది. తను చెప్పింది అబద్ధం. అతన్ని పిలిస్తే నిమిషంలో వచ్చేవాడు: యితరుల విష యాల్లో జోక్యం కలిగించుకోడం తప్పు అన్న జ్ఞానం నేరం చేసినట్టు మాటి మాటికీ తట్టి చెప్తోంది. కోమలి చెప్పే సందేశం ఎలాంటిదో రహస్య మవునో కాదో తెలుసుకోవా లన్న ఉత్కంఠ తీరిందిగాని యీ బాధ యెక్కువైంది. ఇంతకీ కోమలి చెప్పబోయింది, నిన్న అనుకున్న సినిమాకి గాదు, యింకోదానికి వెళ్దా మని. అదికాస్తా చెప్పాక తనని కూడా రమ్మంది.


అప్పుడు గుర్తు కొచ్చింది వసంతకి – కోమలి చెప్పిన మాటలు అతనికి జేరెయ్యలేదని. అ దింకో నేరం! రావు కా సంగతి చెప్పడం మాని, పైగా అతన్ని వెళ్ళకుండా ఆపాలని చూసింది! తెలిశాక తనని గురించి ఏమనుకుంటాడు! వసంతకి మనసు ముక్క లవుతున్న ట్టుంది, క్షణ క్షణానికి యెక్కువగా.

ఆరోజు ఆమె జీవిత చరిత్రలో అతి విషాదకరమైందిగా పెద్ద పెద్ద అక్షరాల్తో చెక్కబడుతుంది. అనుకోని, ఊహించని సంఘటనలు యెన్నో ఆమె మూలంగా జరిగిపోతున్నాయి, ఆమెతో నిమిత్తం లేకుండా.

నిజానికి గడిచిన వారం పదిరోజు ల్లోనూ కొన్ని కొన్ని మాటలు, చేతలు ఆమె యిష్టా యిష్టాలని అధిగమించి వాటంతటవే జరిగిపోతున్నాయి. జరిగి నాక, ప్రతీ మాటా, ప్రతీ చేతా ఏదో అనవ సరమైన ప్రాముఖ్యాన్ని తెచ్చి పెట్టుకుం టోంది – కనీసం, ఆమె దృష్టిలో.

*    *    *

రావు వచ్చి పదిరోజు లవుతుంది. మూడేళ్ళ క్రింద చూసిన చూడ్డం.



"పన్నెండో నెంబరు ఇంటాయని ఏమన్నాడు ? నీటివిల్లుకూడా కడరానన్నాడా ?"

"ఆఁ. ఇంటిపన్నుకూడా ఆయనే కడతానన్నాడు ఇల్లు ఆయన పేర రాస్తే"

మూడేళ్ళ నాటికీ, యిప్పటికీ పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. మూడేళ్ళ క్రితం – అతను థర్డియర్ చదువుతూండే వాడు. ఆమె అప్పుడే కాలేజిలో అడుగు పెట్టింది. యిద్దరి మధ్యా బంధుత్వాన్ని బట్టి, సాన్నిహిత్యం, స్నేహం, అందులో కొద్దిపాటి చనువు ఉండేవి, అంతే. అంతకన్నా వేరే ఆలోచనలకి అప్పటిలో చోటులేదు.

మూడేళ్ళ తర్వాత. రావుకి జీవితంలో ఒక స్థాయి, పరపతి ఏర్పడ్డాయి. యిది వరకటిలా ఊహల్ని గాలిపటల్లా ఆకాశంలో ఎగరేసి అవి చేరిన యెత్తుల్ని చూసి మురిసిపోయే కళాజీవి గాదు. ఆ యెత్తుల్ని స్వయంగా జేరి, సాధించిన విజయాలకి తృప్తిపడే ఠీవి, గర్వం అతనిలో కనబడతాయి. రావు జీవితంలో వచ్చే మార్పులకి తన పైన ప్రభావం ఎలాంటిదో గుర్తించలేనంత దూరంగా లేదు వాస్తవానికి – వసంత.

రామారావు పుట్టి పెరిగింది రోజా పూలపాన్పు కాకపోయినా, యెన్నడూ ముళ్ళులాంటివి గుచ్చుకోలేదతన్ని. యించుమించు ఒక సరళరేఖ అతని బతుకు. స్కూలునుంచి కాలేజి, కాలేజి నుంచి యూనివర్సిటీ, అన్నీ ఒకదాని తర్వాత ఒకటి దాటి సరాసరి ఉద్యోగంలో జేరాడు. చదువులో వెనకబడ్డం లేదు.

నిరుద్యోగం లేదు. చదవా లనుకున్నది చదివాడు, అందువల్ల వచ్చే లా భా లు అనుభవిస్తున్నాడు.

వసంతకి జ్ఞాన మొచ్చినప్పట్నుంచీ తనబతుకు అతనితో ముడిపడుతుం దని తెలుసు. అది చాలా మామూలుగా, సహజంగా కనబడేది. నీరు పల్ల మెరుగు నన్న దెంత కటికనిజమో, యిదీ అంతే. దాన్ని మార్చడం మనిషితరం గాదని అందరి మనస్సుల్లోనూఉండేది. అందుకే వసంత ఎంతవరకు చదవాలో, ఏది చదవాలో అంతా రావుతో మాట్లాడాకనే నిర్ణయించడం జరిగింది. రావుకి ఇంగ్లీషు సాహిత్యంపై అపరిమితమైన మోజు. అందులో డిగ్రీ పొందలేకపోవడం అతనెన్నటికీ మర్చిపోలేని బాధల్లో ఒకటి. ఆ కోరిక వసంతద్వారా తీర్చుకోవా లని అత ననుకున్నాడు. ఆమె అంగీకరించింది.

అయితే, యీ సంగతు లన్నీ యిలా ఉంచి వసంతలో అప్పుడప్పుడు కొత్త కొత్త ఆలోచనలు వచ్చేవి — ముఖ్యంగా వయసులోనూ, వయసుకన్నా యెక్కువగా జ్ఞానంలోనూ పెరిగినకొద్దీ వడ్డించిన విస్తరన్నట్టు, పుట్టగానే బ్రతుకుబాట నిర్ణయంచేసి యిలానే నడిచిపొమ్మంటే, తలొంచుకుని కళ్ళు మూసుకొని, తన స్వేచ్ఛ, తన స్వంతఊహలు, ఆలోచనలు అన్నీ గజంలోతున పాతిపెట్టి, పోవాల్సిందేనా? అతను జీవితంలో ఓటమి నెరుగనివాడు కావచ్చు; అందంచ, దువు, ఉద్యోగం వగైరా లక్షణా లుండవచ్చు; అయితే మాత్రం తనమీద అధికారాన్ని అలా బానిసలా పుట్టగానే అతని కప్పజెప్పా లనెక్కడుంది! అలాంటి సమయాల్లో రావులో లోపాలు కొట్టొచ్చినట్టు కనబడి వసంత ఆలోచనలకి బలం చేకూర్చేవి.

అతనిలో, తన అభిప్రాయాలే సరైన వన్న మొండితనం; అవి యితరులు తప్పనిసరిగాఅంగీగరించాలన్న పట్టుదల అలా లొంగనివాళ్ళకి దూరంగా పోయే టంతటి అహం ఉన్నా యని అనుమానం వసంత కా విషయాలు గుర్తుకొచ్చినప్పు డల్లా తిరగబడా లనిపించేది — యెవరి మీదో, యెందుకో, యెంతవరకో సరిగ తెలియకపోయినా.

అవన్నీ అప్పుడప్పుడు తాకి, వెనక్కి జారిపోయే ఆలోచనల కెరటాలు. ఆమె యెన్నడూ యెటూ బలంగా నిర్ణయించ లేదు. మిగతావాళ్ళ దృష్టిలో పరిస్థితి మామూలుగానే ఉంది. మార్పేమన్నా ఉంటే, అది ఇదివరకటి అభిప్రాయాల్ని మరింత దృఢం, పటిష్ఠం చేసిం దనాలి

ఏడాదినుంచి పంపుతున్న ఆహ్వానాలకి సమాధానంగా రావు వచ్చాడు పది రోజులకిందట. వచ్చేదానికివారంరోజులు ముందు వస్తున్నట్టు రాశాడు. ఆ వారం రోజులూ వసంతలో రకరకాల ఆలోచనలు. పరిపరి విధాల మనసుని చిందరవందర జేశాయి. అత న్నెలా పలక

రించాలి? ఇదివరకట్లా నువ్వు అనాలా! 'మీరు' అనాలా! సిగ్గుపడి కనబడకూడదా; ఇందవరకటంతటి చనువుగా కాకపోయినా మామూలుగా వుండొచ్చా? ప్రతీదీ అనుమానమే. చివరికి మనిషి గురించి తన నెందు కింతగా పట్టించుకోవా లన్న నిర్లక్ష్యం వచ్చింది.

రావు వచ్చాడు, ఉదయం ఎనిమిది గంటలకి. గదిలోంచి బయటికి రాలేదు - రాలేకపోయిం దంతే; కారణం ఏం లేదు. కాసేపు ఏమిటీ జైలని విసుక్కుంది. చేయగలిగిం దేమీ కనబడలేదు.

సాయంకాలం మూర్తిగా రింకాయింటికి రాలేదు. తల్లి వంటింటో ఉంది; మేడ మించి కబురు పట్టుకొచ్చాడు వెంకయ్య; పైకి రమ్మని పిలుపు. అతనే రాగూడదూ? ఆజ్ఞాపన కాబోలు! వెళ్ళాలా, మానాలా? వెళ్ళకపోతేఅనాగరికంగాఉంటుందేమో! పైగా సిగ్గుపడుతుం దనుకుంటాడు! ఆ ఆలోచన రాగానే వసంత ఒక నిర్ణయానికొచ్చింది. జం కెందుకు? కనీసం అలాంటి దేం లేనట్టు అతనికి కనబడ్డం మంచిది.

రావు మంచంమీద పడుకుని ఏదో చదువుతున్నాడు. ఆమెని చూడగానే పుస్తకం అవతల పడేసి కుర్చీ మంచం వైపు తిప్పి, కూర్చో మన్నాడు. ఆమె తలవంచుకు కూర్చుంది.

ఎంతకీ కాలంగడవనట్టుంది వసంతకి. ఏం మాట్లాడుతాడు? ఏం మాట్లాడితే ఎలా సమాధాన మివ్వాలో ఊహిస్తోంది.

"నేను ప్రొద్దున్న ఎనిమిది గంటల కొచ్చాను!" నవ్వాడు రావు.

"విన్నాను" అంది మెల్లగా. అతను నిరుత్సాహ పడాలని ఆమె ఆశ.

"పదిగంటలు పట్టింది. అమ్మాయిగారి దర్శనం కావడానికి!"

"దొరగారు దిగగానే హారతి పాడాలేమిటి?" వసంత అతనివంక ఒకసారి చూసి వ్యంగ్యాన్ని సాధ్యమైనంతగా కప్పిపుచ్చడానికి ప్రయత్నించింది.

"అదిగాదు!....పోనీలేగాని, ఎలా రాశావు ఎగ్జామ్స్?"

"బాగానే రాశా ననుకుంటున్నాను!"

"క్లాసు వస్తుందా?"

"రాదేమో; అంత బాగా రాశా ననుకోను."

రావు కాసేపు మాట్లాడలేదు.

"ఉత్తరం రాస్తే జవా బివ్వవేం?"

"నేనురాసిన నెలకిగాని జవాబివ్వకపోతే యెన్నాళ్ళు కని పెట్టుకు కూర్చోను?"

"టూర్లో ఉన్నప్పుడు ఒక్కసారేగా ఆలశ్య మయింది!"

"నేనూ ఒక్కసారేగా రాయడ మ్మానేసింది!" వసంతకి అనుకోకుండా నవ్వొచ్చింది. అంతవరకు లోపల పేరుకున్న గడ్డ కరుగుతున్నట్టుంది,

ఆ సాయంకాలం మాట లన్నీ అలాగే జరిగిపోయాయి. అత నేదో అనడం,

ఆమె తగినట్టు కర్ట్‌గా జవా బివ్వడంతో సరిపోయింది. ఇప్పట్నుంచీ 'పవిత్ర భారత నారీశిరోమణి' అన్నట్టు తల వంచడంకన్నా కొద్దిగా వ్యక్తిత్వం ప్రదర్శించి తనకీ కొన్ని నిశ్చిత అభిప్రాయా లున్నట్టు ప్రకటించా లని ఆమె సంకల్పం. అయితే ఎక్కడ వ్యక్తిత్వం ఆఖరయి అహం మొదలవుతుందో, అతనికి త నిష్టపడుతున్న 'మందు' సరైన మోతా దెంతవరకో, ఆమెఅంతగా ఆలోచించలేదు. అతని గదిలోంచి వచ్చేస్తుంటే, ఆమెలో అతని అహాన్ని, ఆధిక్యాన్ని ఎదిర్చి నిలబడ గలిగిం దన్న తృప్తి మిగిలింది.

ఆ మర్నా డుదయం.

"మరీ అంత పట్టనట్టుంటా వేమే! అత నేమనుకుంటాడో!" అంది తల్లి

"నేను బయటికి పోతాను. అమ్మ పనిలో ఉంటుంది. ఇంకెవరూ లేరు గదా! అతగాడికి విసు గొచ్చి, రేపే పోతా ననకుండా చూడమ్మా!" అన్నాడు తండ్రి, ఆ మాటల వెనక అర్థాన్ని కళ్ళతో చెప్తూ.

తల్లీ తండ్రీ అతని కిచ్చే ప్రాముఖ్యాన్ని తల్చుకుంటే యింకా చిన్నతనంగా అనిపించింది వసంతకి.

* * *

ఆ సాయంకాలం. గది తలుపులు జేరవేసి కిటికీ దగ్గర నిలబడి తల దువ్వుకుంటోంది. అతను గదిలో కొచ్చి గుమ్మం దగ్గరే నిలబడ్డం అద్దంలో కనబడింది.

"తలుపు తట్టి, రావడం మర్యాదేమో: ముఖ్యంగా ఆడవాళ్ళ గదిలో కొచ్చేప్పుడు!" వసంత కొంటెగా నవ్వుతూ చూసింది అతనివంక.

"ఓ, సారీ!...హాల్లో ఉంటాను. వీలయితే అయిదు నిమిషాల్లో రా" అతను వెళ్ళిపోయాడు తలుపు మూసి. వసంత నవ్వుకుంది

ఆ తర్వాత పావుగంటకి గాని ఆమె తయా రవడం పడలేదు. హాల్లో అతను పేపరు చదువుతున్నాడు.


"ఆలస్య మయింది; ఏమనుకోకు"

"అనుకోడాని కేముందిలే; అలా యెక్కడికైనా వస్తావా?"

"ఎక్కడికి?"

"అలా పోదాం ఎక్కడికి వెళ్తాం, ఎంత సేపు కూర్చుంటాం, ఏం మాట్లాడదాం యివన్నీ ఆలోచించుకు వెళ్తే అదేదో రాజకీయ సమావేశ మనిపించుకుంటుంది గాని..." రావు తర్వాత మాటలు పూర్తి చెయ్యకుండా నసిగేశాడు. వసంతకి నవ్వొచ్చింది. 'ఫర్వాలేదు! దారిలో కొస్తున్నాడు! నిన్నటి అధికారం ఇవాళ గొంతులో కనబడ్డం లేదు!' అనుకుంది. కొంత తృప్తి, మరికొంత చొరవ చోటు జేసుకున్నాయి. మనసు యింకా కాస్త తృప్తికోసం ఆరాటపడింది.

తోటలో కర్రవంతెన కవతల నీళ్ళ



ఒడ్డున చెట్టుచాటుకి ధారి తీశాడు రావు. కాసేపు నిశ్శబ్దం. తర్వాత మెల్లిగా మొదలై, రకరకాల విషయాలు దొర్లిపోతున్నాయి. సినిమాల ప్రసక్తి వచ్చింది.

"నీ కథల్లాగానే ఉంది అది కూడా!" వసంత అంది, కొద్దిగా విసుగు, హాస్యం మిలాయించి.

రామారావుకి తన కథల గురించి ఎలాంటి వ్యాఖ్యానాలూ వినాలని ఉండదు; విమర్శలు అసలు కిట్టవు !

''సినిమా కేం, చాలా బాగుంది !'' అన్నాడు మామూలుగా నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"అదే చెబుతున్నాగా !'' మెచ్చుకోకేంచేస్తా వన్నట్టు చూసింది. రావు కొద్దిసేపు ఆమె మొగంలోకి పరిశీలనగా చూశాడు. యింకా వేళ్ళకి మామూలు మనిషి కాలేదు. చాలా సున్నితమైన చోట తగిలిన గాయ మది. ఆ గాయం చెయ్యాలని చేశాక లభించిన తృప్తితో కొద్దిసేపు చాలా హాయిగా ఉంది వసంతకి. తర్వాత యింటికి వచ్చేస్తూ ఆత నేం మాట్లాడకపోవడం చూసి, అలా అనకపోతే బాగుండేదేమో ననుకుంది. అయినా, అందులో అంత పట్టించుకోవాల్సిం దేం కనబడలేదు. ఆ మాత్రం హాస్యం — తననుంచి - భరించగల గాలంత్రీ లేకపోతే యింకెందుకు ?

* * *

మర్నాడుదయం వసంత చాలా హాయిగా, ఉల్లాసంగా లేచింది, రేడియో పాకిస్తాన్ మేలుకొలుపులికి. రెండు రోజులనాటి బిడియం, అనుమానం

వగైరా లేం లేవు. ఉదయాన్నే - అతని గదిలోకి తనే కాఫీ తీసికెళ్ళింది. అతను మంచం వెనక ఎత్తుగా లేచిన కమ్మీమీద తల పెట్టి ఏదో చదువుతున్నాడు.

''యివాళ యింత దయ కలిగిందేం?''

''ఎప్పటికైనా యీ సేవ చెయ్యాల్సిందేగా!''

"బలవంత మేముంది?" అందంగా దిద్దిన జ్యోతిలాంటి బొట్టువంక చూస్తూ అన్నాడు రావు.

ఆ మాట బాణంలా తగిలింది; అర్థం పూర్తిగా తట్టకపోయినా. అతని కళ్ళు ఏవో గూడార్థాన్ని దాస్తున్నట్టున్నాయి. బలవంతం లేనిది సేవ చెయ్యడానికా, లేక... ! 'యిష్టం లేకపోతే మానెయ్యి, నాకేం పట్టింపు లే'దని చెప్పడమా? అతని అభిప్రాయాలు మారుతున్నాయన్న మాట. అంతదాకా తిరుగులే దనుకున్నది. యిప్పుడు అనిశ్చయంగా గాలిలో వేలాడుతోందన్న మాట. వసంతకి కొత్తరకం ఆలోచనలు మొదటిసారి కలిగాయి. అతను ఆమె మొగాన్ని చదువుతున్నట్టు చూస్తూంటే, ఆమె కోపం మొగంమీద కనబడిపోకుండా దాచుకోవాలని చూసింది. అతనిలాగే తనూ ఏదో ఒకటి అనేస్తేనేగాని మనశ్శాంతి దక్కేట్టు లేదు.

"యివాళ గోల్కొండ వస్తావా?'' కాసేపటి కన్నాడతను.

"పని లేకపోతే సరి!"

"పని లేదుగా మరి!"

"అది కాదు నే ననేది!"

"మ రింకేమిటి? అనేదేమిటో ఒక్కసారే స్పష్టంగా అనకూడదూ!"

"అలా తిరగడాలు నాకు నచ్చవు.''

''నాతో కూడానా?"

"అంటే అర్థం!" - నువ్వు పైనుంచి దిగి రాలేదుగా అన్నట్టు చూసింది.

రావు సాసర్లో కాఫీ వంక చూశాడు. ఆ తర్వాత మరి కాసేపు ఏదో మాట్లాడి వచ్చేసింది.

ఆరోజు కింక అతనిని, ఏవో కొద్ది నిమిషాలు తప్పిస్తే, చూడ్డం పడలేదు. సాయంకాలం కనబడకపోతే గదిలోనే ఉండిపోయా డనుకుంది. కాని వెంకయ్య చెప్పాడు ఏడింటికి – నాలుగింటికే వెళ్ళిపోయా రని; రాత్రి వచ్చేసరికి పదవుతుందని అమ్మగారితో చెప్పమన్నా రని.

వసంతకి మొదట కొద్దిగా బాధ అనిపించింది. అయితే,... తన ప్రయోగాలు ఫలిస్తున్నా యన్న గుర్తింపు కొంత ఉపశమనం కలిగించింది కొంత సేపు. మహాఅయితే ఆరోజూ, మర్నాడూ అలా వెళ్తాడేమో! అంతకన్నా యేం జరగదు!

కాని ఆమె అంచనాలు తారుమారైనా యన్న సంగతి తెలిసింది ఆ తర్వాత నాలుగు రోజులకి. ఆ నాలుగు రోజుల్లోనూ అసలు వాళ్ళిద్దరిమధ్యా మాటలు కలియలేదు. మొదట యింకా వేడి తగ్గలే దనుకుంది; ఆ తర్వాత అతను ముందు

మాట్లాడితేనేగాని మాట్లాడకూడ దను కుంది. మొత్తానికి యిద్దరి మధ్య వాతావరణం స్తంభించింది ఆ నాలుగు రోజులూ.

క్రితంరోజుఉదయం—వసంత మెట్లపై నుంది. రావు హాల్లో అటువైపు తిరిగి నిలబడి ఉన్నాడు. కుడిచెయ్యి పాంట్ జేబులోకి పోనిచ్చి ఎడంచేత్తో ఫోన్ పట్టుకుని కాలితో టేబిల్‌ని తన్నిపెట్టి షోగ్గా నవ్వుతూ మెల్లిగా మాట్లాడుతున్నాడు. ఆగొంతు చాలా సన్నిహితంగా తియ్యగా వస్తోంది. ఆమెతో యెన్నడూ అంత గోముగా మాట్లాడలేదు. వసంత ఆగి అటే చూసింది; మాటలు సరిగ్గా వినబడ్డంలేదు.

"జస్ట్ ఏ మినిట్ కోమలీ! యింటో అడిగి చెప్తాను." రావు తటాలున వెనక్కి—తిరగ్గానే ఎదురుగా ఆమెని చూశాడు. వెంటనే మొగం చిట్లించి లోపలికి వెళ్ళాడు. లోపల మాటలు వినబడ్డాయి.

"యివాళ ఓ ఫ్రెండ్ యింట్లో లంచ్‌కి పిలిచా రత్తయ్యా! నాకు వండకు."

"ఆదేమిటోయ్! ఉన్న రెండు రోజుల్లోనూ..." కాసేపు వాదం జరిగింది. చివర్న "సరే, నీ ఇష్టం." అంది పార్వతమ్మ.

రావు మళ్ళీ వచ్చాడు హాల్లోకి.

"హల్లో, కో! అనుమతిదొరికింది."

.........

"స్ట్రెయిట్లీ!"

అతను గట్టిగా నవ్వి ఫోను పెట్టేసి ఎటో బయటికి వెళ్ళాడు. తిరిగి గదిలోకి వెళ్ళేటప్పుడు మెట్లమీద తనని పలకరించితీరతా డనుకుంది వసంత. కాని, అలా జరగలేదు. ఆ తర్వాత ఆమెకి ఒక వేళ తనతో మాట్లాడాల్సివస్తుం దనే అలా వెళ్ళిపోయాడేమో అని అనుమానమేసింది. ఏదీ యిదమిత్థ మని తేలలేదు. కాని అమితంగా వేధిస్తోంది.

ఆరోజు మొదలు ఆమె ఆమె కాదు. ఎవ రీ కోమలి; పైగా 'కో' అని ముద్దుపేరు కూడాను! అస లా మనిషి నిజమా, లేకపోతే ఊరికే తనని యిబ్బంది పెట్టడానికి యెత్తు వేశాడా? కొంతసేపు యీ 'కోమలి' అనే పేరుతో పిలవబడే వ్యక్తి ఆడది అయ్యుండ దనుకుంది. ఎవరో మగ స్నేహితు డయ్యుంటాడు—కోమలరావో, కమలాకరరావో: అతగాడ్ని పట్టుకుని అలా పిలిచి తనని సాధించా లనుకు నుంటాడు. కథలు రాసే వాళ్ళకి పుట్టే ఐడియా లన్నీ యిలాంటివే!

కాని... అతను మాట్లాడే ధోరణి మగాడితో మాట్లాడుతున్నట్టు లేదు. మరీ అంత లాలిస్తున్నట్టు మాట్లాడతాడేం? ఎవరూ వినకూడ దన్నట్లు మెల్లిగా!

ఇప్పుడైనా మించిపోయిం దేం లేదు; మామూలుగా చనువుగా మాట్లాడేస్తే సరిపోతుందేమో అనిపిస్తుంది ఒకోసారి. అయితే యింతా జరిగాక అలా చెయ్యడాని కేదో అడ్డుపడ్తోంది. పైగా అతనికి

బాగా నాటా లని కొన్నిమాటలు వదిలింది; అవన్నీ వరసగా తిరిగి అప్పజెబ్తేనేగాని తిన్నగా మాట్లాడడు! యీ బింకం, జంకూ తనచుట్టూ గోడలు లేపుతున్న ట్టున్నాయి.

* * *

ఆరోజు ఉదయం ఆమె పిలుపు తను అందుకుంది. 'కోమలి' నిజంగా ఆడదే! గొంతు తియ్యగా సన్నగా చిన్నమనిషిది లాగానే వినబడ్తోంది. వసంతకి అంత వరకు కళ్ళను కప్పుకొన్న మసకతెరలు తొలగిన ట్టుంది.

అసలు అతను యిక్కడికి వచ్చింది కోమలి కోసమేనేమో! యీ మూడేళ్ళలో అతని అభిప్రాయాలు, ఆలోచనలు మార లేదని, మారకూడ దని యెక్కడుంది? ఎప్పుడో యేళ్ళ క్రితం ప్రవ ర్తనబట్టి ఊహించుకున్న అతని అహాన్ని ంచి తనకి రక్ష ణన్నట్టు చుట్టూ ఓ పరదా లాంటిది దించుకుంది. దీన్ని 'అహ'మనే అంటారేమో! అసలు తెలివైనవాళ్ళకీ, ఏదన్నా చెప్పుకోతగింది సాధించిన వాళ్ళకీ యీ జబ్బు ఉండనే ఉంటుంది; అంతమాత్రానికి అత న్నేదో సంస్క రించా లన్నట్టు చుట్టూ గిరి గీసుకుంటే చివరకదే తన పాలిటి బందిఖానా అయింది. తను మామూలుగా ఉంటే అత నలా దూర మయేవాడు కాదేమో! అతనికి దూరంగా పోవాలని తన ఉద్దేశ్యం గాదు; కాని అలా కనబడింది. అప్పటి దది సాకుగా అతను దూర మవుతున్నాడు!

ఇదంతా తను చేజేతులా చేసు కున్నది; జరిగిందానికి పూర్తి బాధ్యత తనదే. ఆ విషయం గుర్తు కొచ్చినప్పు డల్లా వసంతకి బాధ యెక్కు వయ్యేది.

కోమలి చాలా పెద్దదో, పెళ్ళయి పోయినదో, లేకపోతే కనీసం రకరకాల వికారా లున్నదో ఐఉంటుం దని ఊహిం చింది వసంత — ఆమె అలా అవా లన్న ఆశని వేరే రూపంలోకి తర్జుమా చేసుకుని.

అలా కిటికీలోంచి బయటికి చూస్తూ ఆలోచిస్తుంటే యీ జ్ఞాపకాలు, ఆశలు, ఊహలు అన్నీ కలిసి కళ్ళలోకి నీళ్ళు తెప్పించాయి. అవి చెంపలమీదకి కారు తూన్నా ఆమె తుడుచుకోడానికి ప్రయ త్నించలేదు. సరిగ్గా అదే సమయంలో అతను వచ్చి వెనక నిలబడ్డాడు. ఎంత సేపు నిలబడ్డాడో తెలియదు.

"ఏమి టాలోచిస్తున్నా"వని అడిగి నప్పుడు తన కన్నీళ్లు అతను చూస్తాడన్న భయం, అనుకోని అతనిరాకకి ఆశ్చర్యం, సంతోషం, తిరిగి వేలూనుతున్న ఆశా అన్నీ ఒక్కసారి మనసుని ముంచెత్తాయి. సాధ్యమైనంత మంచిగా మాట్లాడా లని చూసింది; కాని ఏం మాట్లాడ్తోందో పూర్తిగా ఆమె స్వాధీనంలో లేదు.

అతను తనకన్నీటిని 'ఐడిల్ టియర్స్' అని కొట్టిపారేశాడు. సినిమాకి రమ్మని పిలిచాడు గాని రానంటే రెండోసారి అడ

క్కుండా వెళ్ళిపోయాడు. ఏదో మాటవరస కడిగిన ట్టుంది! పైగా తను వద్దంటే, "కోమలి కనిపెట్టుకుంటుం" దని స్పష్టంగా చెప్పాడుకూడా. గడిచిన విష యాల్ని గుర్తులో పెట్టుకుని ఆలోచిస్తే అతని తప్పేదీ ఉన్నట్టు కనబడదేమో! తనే, వెళ్ళివుండాల్సింది! కనీ సం కోమలి ఎలా ఉంటుందో చూడ్డానికయినా వీ లయేది!

యీమధ్య పశ్చాత్తాపాలు యెక్కు-వయ్యాయి. చేసిన ప్రతిపనీ చేసేశాక తప్పుగా కనబడ్తోంది! యీ ఆలోచన లన్నిటిమధ్యా నిద్ర పట్టేసింది.

మెలుకువ వచ్చేసరికి సాయంకాలం ఆరు. తొందరగా లేచింది. మూడు గంటలు నిద్రపోయిం దన్నమాట. అంత సేపు పగటి నిద్ర ఎన్నడూ అలవాటు లేదు. బయ టంతా చీకటిగా ఉంది, మబ్బులు దట్టంగా పట్టి. ఒక లయగా హెచ్చుతగ్గులు లేకుండా ఒకటే వరసని చినుకుతూంది. ఏదో తెలియని బాధ, విసుగు పుట్టించే వాన! మామూలుగా ఉన్నప్పుడే బాధగా ఉండేది; మనసు సరిగా లేనప్పుడు మరీని! వసంత మొగం కడిగి గదిలో కూర్చుంది. లైటు వెయ్యబుద్ధి కాలేదు. మంచం మీద కూర్చొని నిద్రకి ముందు రేగిన వన్నీ నెమరేసుకుంటూంటే —

యింటిముందు కా రాగింది. రావు దిగి, వరాండాలో నిలబడి చెయ్యాడించాడు. కారు అద్దాల్లోంచి ఓ ఆడమొగం కని పించింది మసకగా. ఆ మొగం యెలా ఉందో గుర్తించడానికి వీ ల్లేకుండా చీకటీ, చినుకులూ అడ్డుపడ్డాయి.

"ఎవరోయ్, కార్లో!" మూర్తిగారు అడుగుతున్నారు.

"కోమలి అని వాల్తేర్లో మేం చదువు తున్నప్పుడే యింగ్లీషు ఆనర్సు చదువు తూండేది. రెండేళ్ళు జూనియర్ మాకు. ఏవో యాక్టివిటీస్‌లో పరిచయ మైంది. యిప్పుడీ ఊర్లో లెక్చరర్ ... అన్నట్టు రేపు మధ్యాహ్నం యిక్కడికి టీ కి పిలిచాను.''

"మంచిపని జేశావు. అలాంటివాళ్ళ తెలిసుండడం మంచిది!"

వసంత కీ మాట లన్నీ వినబడ్డాయి. అదీ సంగతి! యీ సాహితీప్రియుడికి, ఆ సాహితీవేత్త అలా తెలుసన్నమాట! ఒక్కసారి గుండెలో ఏదో బలంగా లోతుగా దించిన ట్టయింది! ఎంత తెగించి చెప్పేశాడు? అవును, అతనికి భయ మేమిటి! తనని ఊరికే చూడ్డానికి వచ్చాడు. రేపు యింటికి వెళ్ళి 'నేను కోమలినే గాని మరెవర్నీ చేసుకోను!' అంటే అడ్డుకో గలిగిం దెవరు?

ఆరాత్రి భోజనం చెయ్యబుద్ధి కాలేదు. అయినా బలవంతంమీద ఏదో లోపలికి పోనిచ్చింది.

రాత్రి మంచాన జేరగానే యింతకు ముందున్న కలవరం, కలత అన్నీ పోయి

నిశ్చల సమాధిలాంటి నిరాశ ఆవహించింది. అతనికీ తనకీ మధ్య ఆమె చోటు జేసుకుంది. అతని నిర్లక్ష్యానికి అదే అర్థం. అందుకే తనెంత కవ్వించినా పట్టించుకోడంలేదు. యిదివరకైతే తనన్న మాటలకి వెంటనే కోపంగా జవాబిచ్చేవాడు! వసంత కంతా విడిపోయినట్టుంది. యింక అతనికి మళ్ళీ దగ్గర కావడం అసంభవమేమో! అసలు యెలా ప్రయత్నిస్తుంది?

అర్ధరాత్రి గదిలోకి వెళ్ళి మంచం కాళ్ళవైపు జేరి శరత్ పాత్ర లాగ "నీ పాదాల దగ్గిర కొంచెం చోటి య్యి రాముదా?" అని అడుగుతుందా?

లేకపోతే అతనికి ఉన్నపళాన ఏ చిన్న జ్వరమైనా వస్తే బాగుండును! రాత్రింబవళ్ళు జుట్టు రేగినా, బట్టలు మాసినా పట్టించుకోకుండా కాలెండరు కాగితాలు చిరిగి రాలిపోతుంటే, థర్మామీటరు, ఔన్సుగ్లాసు పక్కన పెట్టుకుని సేవ జేసి, "హే భగవాన్!" అని నిట్టూర్చి తిరపతి తీసుకొస్తానని భక్తి ప్రకటించి పాతివ్రత్యం ప్రదర్శిస్తే — చివర్నిమాసిన గడ్డంతో అతను తేరుకొని "నన్నుక్షమించు వసూ! నిన్ను అర్థం చేసుకోలేకపోయాను!" అంటాడేమో!


వసంతకి తన ఆలోచనలకి నవ్వొచ్చింది.

ఆ రాత్రి యెప్పుడు నిద్రపట్టిందో తెలియదు. కాని పన్నెండింటి కింకా మెలుకువగానే ఉంది. ఆ తర్వాత యెప్పుడో? మర్నాడు ఉదయం కళ్లు తెరిచేసరికి యెండ చాలా పైకెక్కింది. టైం, ఏడున్నర. పదేళ్ళలో ఎన్నడూ అంత ఆలస్యంగా లేవలేదు. కాని ఆరోజు ఒళ్ళంతా బరువెక్కినట్టయి అప్పటికీ లేవబుద్ధి కావడంలేదు. కళ్ళు మూతలు పడుతున్నాయి. ముక్కులోంచి గాలి వేడిగా గాడుపులా వస్తోంది. నోరంతా చేదు. ఓపిక తెచ్చుకుని మొగం కడిగి మెల్లిగా థర్మామీటర్ తెచ్చుకుని గదిలో కూర్చుంది. నూటమూడు! ఆ దొంకమాదిరి తృప్తితో మెల్లిగా మంచం మీదకి ఒరిగింది.

జ్వరంసరిగ్గా సమయానికి వచ్చి కాపాడింది. లేకపోతే సాయంకాలం టీకి కోమలి వచ్చినప్పుడు, తనూ వాళ్ళతోబాటు కూర్చోడం, వాళ్ళిద్దరూ ఒకరివంక ఒకరు మాట్లాడేకళ్ళతో చూసుకుంటూంటే బాధపడ్డం యివన్నీ తప్పిపోయాయి. పైగా తనకి జ్వరం వస్తే రావు ఏంచేస్తాడో 'స్టడీ' చెయ్యొచ్చు. అతని ఆలోచనలూ అభిప్రాయాలూ ఎలా ఉన్నాయో తెలుసుకోడానికిది అంతిమ పరీక్ష. వసంతకి శాంతిగా ఉంది.

ఆ మధ్యాహ్నం నిద్రలో ఒక కల.

యింటిముందు పందిరి వేశారు. పెళ్ళి జరుగుతోంది. తనది కాదు; రావుది, కోమలితో. తను కాసేపు పందిరాట కాసుకొని నిలబడి తర్వాత మెల్లిగా యెక్క




డీకో పోయింది. వెనకాల్నుంచి యెవరో విషాదంగా పాడుతున్నారు ! అది మొదటి భాగం.

రెండోభాగంలో తను టేబిల్ దగ్గిర జుట్టంతా విరబోసు కూర్చుని ఉత్తరం రాసేస్తోంది. "బావకి, - నేను వెళ్తున్నా. బావా ; చాలాదూరం - ఎక్కడికో యింతవరకూ ఊహించలేదు. బహుశా యీ జన్మకింక చూడవు. కాని యీ ప్రపంచంలో ఏ మూల నున్నా, నీకు సుఖాన్నియ్య మనే దేవుడ్ని ప్రార్థిస్తూంటాను. కోమలి నీకు బాగా తగినది, ఆమె నీకు సుఖాన్నిస్తుందని తెలుసు నాకు.

ఏ నీరెండల సాయంకాలమో, ఏ వెన్నెలరాత్రో, సముద్రతరంగాల మ్రోత వింటూనో, మల్లెల గుబాళింపులు ఆస్వాదిస్తూనో - వసంత అనే అభాగిని ఉండేదన్న తలపు లీలగా నైన నీలో మెరిస్తే నా జన్మ సార్థక మైందని తృప్తిపడ్తాను. మరోజన్మ అంటూ ఉంటే తప్పక నీ సేవలో వినియోగించ మని భగవానుని ప్రార్థిస్తూ - వెళ్తున్నా. సెలవు. ఎప్పటికీ నీ, - వసంత.

'వసంత' అని సంతకం చేస్తుంటే చెంపల్ని గోదావరి పాయ లయినట్టుంది.

ఉలిక్కిపడి లేచి చెంపల్ని తుడుచుకుంది. మొగ మంతా చెమట పట్టేసింది. బయట హాల్లోంచి గట్టిగా మాటలు వినబడుతున్నాయి.

కోమలి వచ్చింది ;

కోమలి యెలా ఉంటుందో చూడా

లన్న ఉత్సుకతని బలవంతాన అణుచుకుని అలాగే చెవు లటు అప్పగించి పడుకుంది.

మూర్తిగారికీ ఆమెకీ మధ్యనే మాటలు జరుగుతున్నాయి. మధ్య మధ్య అప్పు డప్పుడు రావు చిన్న చిన్న మాటలు కలువుతున్నాడంతే. వాళ్ళిద్దరూ మాట్లాడు కోవాల్సిన పని లేదు ; వసంతకి చెప్పలే నంత కసిగా వుంది. మూర్తిగారూ, పార్వతమ్మా యిద్దరూ ఆమెతో చాలా ఆప్యాయంగా మాట్లాతూంటే కోమలి చాలావినయంగా నెమ్మదిగా మాట్లాడు తోంది.

ఓ అరగంట పోయాక కోమలి అడి గింది, "మీ అమ్మాయి యెక్కడ ?" అని.

"రండి, చూద్దురుగాని; ప్రొద్దు న్నుంచి జ్వరం. మంచం దిగలేదు." అంతా లేచారు.

వసంత గుండెలు వేగంగా కొట్టు కుంటున్నాయి. సర్దుకు కూర్చోంది, ఆమె గదిలో కడుగు పెట్టగానే నిలబడ్డా నికి వీలుగా.

అందరికన్నా ముందు అడుగు పెట్టారు మూర్తిగారు. వెనకనే కోమలి ఉంది. కోమలి పచ్చగా నాజూగ్గా ఉంది అంత సన్నంలోనూ బాగా పుష్టిగా కని పించే శరీరం పొడుగ్గా ఠీవిగా కన బడ్తోంది. రావు ప్రక్కన ఆమె నిల బడితే, రావు అలా మారిపోవడానికి కారణం అర్థమౌతున్నట్టుంది. వెంటనే మళ్ళీ ఏదో చెప్పలేనంత నిస్పృహ, నీరసం పట్టుకున్నాయి వసంతకి.

"మిస్ కోమలి, ఎం. ఏ. — మిస్ వసంత, కాబోయే బి. ఏ." రావు పరిచయం చేశాడు.

"కాబోయే మిసెస్ రావ్ !" కోమలి నవ్వుతూ జేర్చింది, అందరివంకా వరసగా చూస్తూ.

మూర్తిగారు అదేదో పెద్ద విట్ అన్నట్టు విరగబడి నవ్వారు.

"ఈ యేడు చేసెయ్యా లనుకుం టున్నాం !'' పార్వతమ్మగారు కలిసింది.

రావు వసంత మొగంలోకి చూశాడు. వసంత మొగం జేవురించి తల దించు కుంది.

అందరూ తలోచోటా కూర్చున్నారు.

"పరీక్ష లెలా రాశారు ?" కోమలి అడిగింది. ఆమె గొంతులో స్నేహం, సౌమ్యం చాలా సహజంగా హృదయం లోతునుంచి వస్తోన్నట్టున్నాయి.

''బాగానే రాశానండి.''

"వెదర్ బాగా లేనప్పుడు, పగటి

పూట యెక్కువసేపు నిద్రపో కండి''
అందామె మళ్లీ. తన లాగా ఉద్రేకాలు, ఆవేశాలు ఏవీ రెరగనట్టు. ప్రశాంతంగా కనబడే ఆమె కళ్ళలోకి చూస్తుంటే వసంతకి ఒక మాదిరి సిగ్గూ, నమ్రతా కలుగుతున్నాయి.

"ఆమె జ్వరానికి కారణం నిద్రపోడం కాదులెండి ! ఆకాశం నీలంగా యెందు కుందో, మనుషులు చేతులమీద యెందుకు నడవరో—యిలాంటి వన్నీ ఆలోచిస్తూం టుంది. అర్థం లేని వన్నీ తనకి తానే కల్పించుకుని మెదడు పాడుజేస్తేనే, అలా ఉన్నట్టుండి నూటమూడు నూట నాలుగు వచ్చేది !"

"ఆమె కంతటి ఆలోచనాశక్తి, అన్వే షణాశక్తి ఉన్నందుకు మీరు సంతో షించాలి !"

"యిదొకటికూడా నేర్పండి మీరు !'' రావు నవ్వాడు.

''అదలా ఉంచండి; మీకిలా ఉండ గానే, ఆయన రేపు వెళ్ళిపోతా మంటు న్నారు. ఊరుకుంటారా, మీరు?" వసంత నడిగింది కోమలి.

''ఏమిటి రేపు వెళ్తావా ?'' పార్వ తమ్మగారు విస్తుపోయి పెద్ద అసంభ వాన్ని వింటున్నట్టు అడిగింది.

"అవును, రేపు వెళ్ళాలి !''

వసంత ఒక్కసారి అతని వంక చూసి, తల దించుకుంది.

"నో, నో, అది జరిగేపనిగాదు !' మూర్తిగారు స్పష్టంగా చెప్పారు.

రావు మాట్లాడలేదు. అది ముమ్మా టికీ జరిగేపనే అన్నసంగతి అందరికీ తెలుసునన్నట్టు నిర్లిప్తంగా ఊరు కున్నాడు.

కాసేపటికి కోమలి లేచింది.

''యీ ఊర్లోనే ఉంటాం కాబట్టి మళ్ళీ కలుసుకుందాం" అంది వసంతతో

''తప్పకుండా" వసంతకి యిన్నా ళ్టికి మాటలు పూర్తిగా మనసుల్ంచి వచ్చాయి. హాయిగా ఉంది.

ఆతర్వాత మూర్తిగారు యెటో బయ టికి వెళ్లారు. పార్వతమ్మ లోప లెక్కడో ఉన్నారు.

రావు లోపలికి వచ్చి కుర్చీలో కూల బడ్డాడు, మంచానికి దగ్గరగా లాక్కుని వసంత మంచం కమ్మీమ్మెకి ఒరిగింది

''జ్వరం వచ్చిం దన్న సంగతి నాకు తెలియదే !''

"నేను చెప్పాలా మీతో ! మీరు తెలుసుకోవాలి ! అంతే !''

''ఉన్నట్టుండి సంబోధనావిభక్తిని మార్చేశావేం ? జ్వరలక్షణమా ?'

"యింక పైన యింతే. ఆ రంగం అయిపోయింది. యి దింకో రంగం వసంత తేలిగ్గా నవ్వింది.

రావులో ఒక్కసారిగా ఆ నీ సంగా నవ్వే కళ్ళని పెదాల్తో తాకా లన్న కోరిక తరంగం బలంగా లేచింది.

"యిప్పు డెంత ఉందో చూడు టెంప్!''

"చూడక్కర్లేదు. ఎప్పుడో పోయింది...అది సరే గాని, రేపు వెళ్తారా?''

"ఊఁ."

''వెళ్ళడానికి వీల్లేదు.''

"మానేశాం.'' యాంత్రికంగా ఠపీమని అన్నాడు.

అతడు చెప్పిన ధోరణికి నవ్వొచ్చిందామెకి.

"రేపు గోల్కొండ వెళ్దాం.—" వసంతా!

"నా కలా తిరగడం నచ్చదు."

"నాతో కూడానా?''

''అంటే అర్థం?''

రావు నవ్వాడు.


అతని చేతిని రెండు చేతుల్లోనూ పట్టుకొని వేళ్ళతో ఆడుకుంటూంటే గాలి కెరటాలపైని తేలిపోతున్నట్టుంది. వసంతకి.

''నన్నింకెన్నడూ ఆలోచించనివ్వకండి!" అంది కాసేపటికి మెల్లిగా, అతని చేతి మీద ఆనుకుని.

''అంటే అర్థమేమిటో?" రావు సగం పైకీ, సగం లోపలికీ అనుకున్నాడు.

"పెద్ద యిదిగా కథలు రాస్తారుగా! ఆలోచించండి.''

రావు ఆలోచిస్తూనేఉన్నాడు. ★





బైటికి చుస్తోంది అనూరాధ. గుబురుగా పెరిగిన సరుగుడు చెట్లు వలయాకారంగా తిరుగుతూ మాయమౌతున్నాయి. ఎత్తుగా పెరిగిన పొలాలు, చిన్న చిన్న నీటి గుంటలు రెప్ప పాటులో మాయమౌతున్నాయి.

వానజల్లు ముఖానికి కొడుతూ ఉండడంవల్ల బయటికి చూడలేక గ్లాసు తలుపులు వేసి ప్రక్కనే బల్లమీద మెత్తని పరుపు మీద నిద్రపోతున్న ''బాబు'' ముంగురులను సర్దుతూ కూర్చుంది అనూరాధ. 'వచ్చేదే విజయవాడ స్టేషను. దిగవలసిన ప్రయాణీకులంతా సర్దుకుని కూర్చోండి' అన్న



ట్టుగా యింజను ఓ పెద్ద కేక పెట్టి తన శక్తి నంతా కూడదీసుకుని పరుగు లంకించుకుంది. ట్రైను జోలపాటకు హాయిగా పడుకున్న బాబు యింజను కేకతో బాటు తను కూడ శృతి కలిపాడు. అనూరాధ బాబును సముదాయించేసరికి ఉసూరు మంటూ కలకత్తా మెయిల్ విజయవాడ స్టేషను లో ఆగింది. 'మీరంతా కాఫీ ఫలహారాలు పుచ్చుకోండి. నేను కడుపు నిండా నీళ్ళు త్రాగి వస్తాను' అన్నట్టుగా యింజను కేకేసింది. స్టేషనంతా ప్రయాణీకులతో నిండి పోయింది. దిగవలసిన వాళ్ళని దిగనీయకుండా ప్రయాణీకులు ఎక్కుతున్నారు. టీ, కాఫి, పువ్వులు, పుస్తకాలు వగైరా అమ్మే వాళ్లు గొంతుక చించుకొని అరుస్తున్నారు.

బాబును ఎత్తుకుని ఫ్లాస్కు పట్టుకుని క్రిందికి దిగింది అనూరాధ. కాంటిన్ ప్లాట్ ఫారం చివర వుంది. మెల్లిగా అక్కడికి దారి తీసింది. ఫ్లాస్కులో రెండు కప్పుల కాఫీ పోయించుకుని టిఫిన్ పొట్లం కట్టించుకుని కంపార్టుమెంటు చేరుకుంది. అనూరాధ రావడం చూసి ఎదురు బల్లమీద కూర్చున్నవారు క్రిందికి దిగేరు. తను తెచ్చిన టిఫిన్ తింటూ బాబుకు కాస్త కాస్త పెడుతూ ముగించి కాఫీ త్రాగి, బాబుతో కబుర్లు చెబుతూ కూర్చుంది అనూరాధ.

"రాధీ!" అన్న పిలుపు విని తలెత్తి చూసింది అనూరాధ. ఎదురుగా చిరునవ్వు నవ్వుతూ నిలబడ్డ వ్యక్తిని గుర్తు తెచ్చుకోడానికి ఒక్క నిముషం పట్టింది అనూరాధకు.

"మాధవ్!" అప్రయత్నంగా రాధ నోటినుండి వెలువడ్డాయి.

"రాధీ! గుర్తు పట్టావా?" అన్నాడా వ్యక్తి చిరునవ్వు నవ్వుతూ. అదే చిరునవ్వు. మనిషిమాత్రం కొంచెంగా లావెక్కినట్టున్నాడేమో! 'అందంగా, నిండుగా వున్నాడు' మనస్సులో అనుకుంది రాధ. మాధవ్ వెనుక నిలబడ్డ యువతిని చూసి మరీ ఆశ్చర్యచకితురాలయింది అనూరాధ.

"రాధా! కులాసానా? నన్ను మర్చిపోలేదు కదా" అని అంది ఆ యువతి.

"లలితా, నిన్ను మర్చిపోతే, నన్ను నేను మరచినట్లే. రండి లోపల కూర్చుని మాట్లాడుకుందాం" అంది రాధ.

వారు లోపలకు వచ్చాక లలిత చేతులు తన చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా దగ్గర కూర్చోపెట్టుకుంది.

మాధవరావు వారికి ఎదురుగా కూర్చునిబాబునుదగ్గరికితీసుకున్నాడు.